
# రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక



Editor : **B.V.L.N. Raju**

విడి ప్రతి : ₹ 12/-



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ : 534 265

ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 25 | సంచిక : 1 | సెప్టెంబరు 2019

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

సద్గురు శ్రీనాన్నగారు
గురుపూర్ణిమ
అరుణాచల మహత్యం
శ్రీమద్భగవద్గీత

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## సద్గురువు శ్రీనాన్నగారు

దిః 23-09-1934న శరీరము ధరించి, భక్తకోటిచే ప్రియముగా 'నాన్నగారు' అని పిలువబడిన సద్గురు శ్రీనాన్నగారు నిజంగా విశ్వజనకుడే! శరీరధారిగా మనమధ్య లేకపోయినా, సర్వవ్యాపి అయిన తాను, అందరి హృదయాలలో నిరంతరం కొలువై ఉన్నారు. తాను జీవించియున్న కాలములో నిరాడంబరత, నిజాయితీ, మంచి జీవితపు అలవాట్లు, కలిగియుండి తాను ప్రశాంతముగా జీవించి, అందరిపట్ల సరళస్వభావం కలిగి ఉండేవారు. జీవిత సమరములో సతమతమయ్యే తోటి మానవులకు సాయపడుతూ, అత్యున్నత లక్ష్యమైన మనోనాశముపై వారి వాక్కును, దృష్టిని గురిపెట్టేవారు. గురువు చేసే పని మనస్సును అంతర్ముఖం చెయ్యడమే! "నీవు చేసే పనిని ప్రేమించు, పనిలో దైవాన్ని చూడు" అన్నదే వారి సూక్తి. అన్ని బహుమతులకంటే జ్ఞాన బహూకరణ శ్రేష్టమైనది. అన్న, వస్త్ర, ధన, సహాయములకంటే కూడా జ్ఞాన బహూకరణ శ్రేష్టమైనది, కారణము అది మానవుని దుఃఖములేని స్థితికి చేర్చి, పరమశాంతిని ప్రసాదిస్తుంది. అట్టి జ్ఞానాన్నే నాన్నగారు మనకు అందించారు. మాటలతోనే కాక, మౌనంతోనూ బోధించారు, దానికి కారణం మానవజాతిపట్ల వారికి గల ప్రేమ, కరుణ, దయ మాత్రమే! "గురువు శరీరంతో ఉన్నప్పుడు కూడా గురువంటే ఆ శరీరము కాదు. గురువంటే పదార్థము కాదు, నామ, రూపాలు కాదు, గురువంటే అనుగ్రహం. అనుగ్రహించే వస్తువుకి మరణము లేదు. చావు గమ్యంగా కలిగిన వస్తువు అనుగ్రహించలేదు. నాలుగు వేదాలు ప్రతిపాదించిన జీవబ్రహ్మైక్య స్థితి అనగా, జీవుడు వాస్తవముగా తాను ఎవరో? అనుభవైకవేద్యం చేసుకోవాలి అన్నదే వారి బోధాసారం. భూమిపై ఆయా కాలములలో, జీవకోటిని అంతిమ సత్యంలోకి మేల్కొలుపుటయే గమ్యముగా పెట్టుకొని, మనమధ్యే గురు రూపంలో సంచరించిన మహాత్ములకు, మానవాళి ఎంతో ఋణపడి ఉంటుంది.

ఓం తత్ సత్

**(దిః 23-09-2019 సద్గురు శ్రీనాన్నగారి జయంతి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారు

## (శ్రీనాన్నగారి జయంతి సందర్భంగా)

**సేకరణ - బేబి, హైదరాబాద్**

మన ప్రియతమ తండ్రి, ఆత్మస్వరూపులు అయిన సద్గురు శ్రీనాన్నగారు ఈ భూమి మీద 84 సంవత్సరాలు దేహంతో మన మధ్య జీవించి అంతులేని ప్రేమ అనుగ్రహం మనపై వర్షించారు. పండిత పామరులకే కాకుండా సాధారణ గృహిణులకు కూడా అర్థం అయ్యే తేలిక భాషలో రమణతత్వాన్ని బోధించి వారిని చైతన్యవంతుల్ని చేసారు. భక్తులకు ఆయన సమక్షంలో గడిపిన ప్రతి క్షణం మధురమే! శ్రీనాన్నగారు మహానిర్యాణము పొంది దాదాపు 21 మాసములు గడిచాయి. ఆయన సమక్షంలో పూర్వం జరిగినట్టే ఇప్పటికీ ఆయన సమాధి వద్ద వైభవంగా కార్యక్రమాలు జరగటం భక్తుల అదృష్టం. భక్తుల హృదయాలలో ఆయన స్థానం పటిష్టం చేసుకొని, ఆయన దేహంతో లేరు అనే స్పృహ కూడా లేకుండా భక్తులను ఆనందసాగరంలో ఓలలాడిస్తున్నారు. సెప్టెంబర్ 23న శ్రీనాన్నగారి 86వ జయంతిని పురస్కరించుకొని, **డాక్టర్ రామారావు గారు, నాన్నగారి షష్టిపూర్తి సందర్భంగా రాసిన వ్యాసములో వారు పంచుకొన్న భావాలు** ...

పురాణ పురుషుల పాద స్పర్శతో పునీతమైన పుడమి తల్లి, పుణ్యపురుషుల కన్నతల్లి మన తల్లి భారతి. అట్టి భరతమాత గర్భాన పవిత్ర గోదావరి తీరాన, సాగర సంగమ సమీపాన 1934 సెప్టెంబర్ 23 ఆదివారం నాడు, నిండుపున్నమి రోజున పుణ్య దంపతులు జిన్నూరు గ్రామవాసులు సూర్యనారాయణ రాజు, రాజయ్యమ్మల ప్రథమబిడ్డగా, వెంకట లక్ష్మీ నరసింహరాజు నామధేయంతో ఆధ్యాత్మిక ఆకాశాన ఒక పూర్ణ చంద్రుడు ఉదయించాడు.

**పులినోట్లో పడ్డ మాంసపు ముక్క ఏ విధంగా అయితే బయటకు రాదో, అదే విధంగా గురువు అనుగ్రహంలో పడ్డవాడు రక్షింపబడతాడు గాని, ఎన్నటికీ అతనిచే విడువబడడు.**

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు, చిరుప్రాయమునందే ఆధ్యాత్మికచింతనతో ఆ బాలుడు దిన దిన ప్రవర్ధమానుడయ్యాడు, పుణ్యతీర్థాలు సందర్శించాడు, పునీతుల దీవెనలు అందుకున్నాడు.

అరుణాచలఋషిగా వినుతికెక్కిన భగవాన్ శ్రీ రమణమహర్షి 1957లో ఆ బాలునికి స్వప్నములో దర్శనమిచ్చి ఎత్తుకొని, హృదయానికి హత్తుకొని, ముద్దాడి ఆశీర్వదించారు. అంతే 1983లో ఆ మొగ్గ పువ్వుగా మారిపోయింది. గోదావరి ప్రాంతమంతా రమణతత్వ పరిమళంతో గుప్పుమంది. ఆ గుబాళింపు దేశ విదేశాలు వ్యాప్తి చెందింది. వారే జిన్నూరు శ్రీనాన్నగారు! భక్తులు కొలిచే పెన్నిధి దీనుల పాలిట కల్పతరువు.

కొందరు అంటూ ఉంటారు, “ఆయన సద్గురువునని ప్రకటించుకున్నారా?” అని. వేరుభావన వున్నవాడు ప్రకటించుకుంటాడు. మరి ప్రకటించుకునే వాడే లోపల లేనప్పుడు ఎవరు ప్రకటించుకుంటారు? ఎవరికి ప్రకటించుకుంటారు? ప్రకటించుకునే వాడు అసలు గురుశబ్దానికి అర్హుడా? మంత్రం చెప్పినంత మాత్రాన, మహిమలు చేసినంత మాత్రాన, ప్రతీ వాడు గురువు అవుతాడా? కాదు! ఆత్మ ద్రష్ట ఒక్కడే గురువు! చూపు చేతనో, మాట చేతనో, స్పర్శ చేతనో మనస్సును హృదయములోనున్న ఆత్మ వైపునకు అంతర్ముఖ పరచగలవాడే గురువు శబ్దానికి అర్హుడు.

మన మానసిక స్థాయికి దిగి వచ్చి ఆర్తులకు సత్యాన్ని విప్పి చెపుతూ, చేతికి పట్టి చూపుతూ, తన శాంతితో ఎందరి హృదయాలలోనో కాంతిని నింపుతూ, చూపులతోనే ఎందరి కన్నీళ్ళనో తుడుస్తూ, అజ్ఞాన తిమిరంలో అలమటిస్తున్న అభాగ్యుల జీవితాలలో జ్ఞాన దీపాలను వెలిగిస్తూ, గృహస్థుగా జీవిస్తూ తన జీవితాన్నే ఒక సందేశముగా చూపిస్తూ - మాటలతోనో, మౌనంతోనో, చూపులతోనో, స్పర్శతోనో, తనను దర్శింప వచ్చిన వారిని హృదయపు లోతుల లోనికి పయనింప చేస్తున్న పరమ పవిత్రుడు, జ్ఞాన స్వరూపుడు శ్రీనాన్నగారు.

“మీ ఇంటికి వస్తే ఏమిస్తారు - మా ఇంటికి వస్తే ఏమి తెస్తారు” .. ఇదీ నేటి సమాజ దుస్థితి! ఇటువంటి రోజులలో.

**గురువుతో సహవాసం వల్ల మీకు తెలియకుండానే సాధన జరిగిపోతుంది.**
**గురువుతో సాంగత్యం సాధనలలో కెల్లా గొప్ప సాధన.**

"నా మాటలను సక్రమంగా అర్థం చేసుకోండి, అర్థం చేసుకోవటం కూడా ఒక యోగమే, అదే మీరు నన్ను గౌరవించటం! మీ దండల్ని గానీ, దండాలను గాని, ధనాన్ని గాని నేను ఆశించుట లేదు. మీరు తిన్న అన్నం జీర్ణం చేసుకుంటే మీ వంటికి బలం, నా మాటల్ని అర్థం చేసుకుంటే మీ మనస్సుకు బలం. అవి మీ స్వరూపాన్ని తెలుసుకోవటానికి సహకరిస్తాయి. నన్ను మీరు తెలుసుకుంటే మీరు సుఖపడరు, మిమ్మల్ని మీరు తెలుసుకుంటే మీరు సుఖపడతారు" అని శ్రీనాన్నగారిలా చెప్పే నిస్వార్ధ గురువులు ఎందరుంటారు?

వేష భాషలతో సమాజాన్ని మోసపుచ్చి దోచుకొనే నేటి రోజులలో, "విషయం మీ బుద్ధికి అర్ధం అయ్యేలా చెప్పలేకపోతే, ఆ దోషం నాది కానీ మీది కాదు. నాలో పవిత్రత వుంటే మీరు మరిచిపోవాలనుకున్నా నా మాటలు మిమ్ములను వెన్నంటి తరుముతాయి. నేను స్మరించినంత మాత్రము చేతనే మీకు శాంతి కలుగక పోతే, నాలో శాంతి లేనట్లే. నాలో పవిత్రత లేనట్లే. నన్ను చూడగానే మీ మనస్సు ఆత్మ వైపుకు తిరగకపోతే ఆ లోపం నాదిగానీ మీది కాదు" అని శ్రీనాన్నగారిలా చెప్పే సాహసమున్న గురువులు ఎందరున్నారు?

విప్లవాల పేరుతో సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న నేటి తరానికి "ఏది విప్లవం? కర్రలు పెట్టి కొట్టుకుంటే, కత్తులు పెట్టి కుత్తుకలు కోసుకుంటే, తుపాకులు పెట్టి కాల్చుకుంటే, బాంబులు పెట్టి పేల్చుకుంటే, వీధులలో లూటీలు చేస్తే అది విప్లవమనో ఏదో అంటున్నారు. కాని అది విప్లవం కాదు. మీ మనస్సును మీరు సంస్కరించుకుంటే అదే నిజమైన విప్లవం! అంతకు మించిన విప్లవం లేనేలేదు" అని విప్లవానికే భాష్యం చెప్పారు శ్రీనాన్నగారు.

గుడ్డలు మార్చుకొని అడవులకు వెళ్లమనో, అన్న పానాలు మానుకోమనో , సంసారాలను విడిచి పెట్టమనో శ్రీనాన్నగారు బోధించుటలేదు! ఆత్మ కోసం, సత్యం కోసం, స్వరూపసుఖాన్ని పొందటం కోసం, మన మనస్సుల్ని శుద్ధిగా ఉంచుకోమని, హితవైనదే మితముగా తినమని, మితనిద్ర, మితభాషణ, అలవరచుకోమని మన మేలుకోరి చెపుతున్నారు శ్రీనాన్నగారు.

వారు బోధించే అమృతవాక్కులు ఒక దేశానికో, మతానికో, కులానికో పరిమితం కాదు. "భగవంతుడు మనకి బుద్దిని ప్రసాదించాడు. ఎందుకు?ఆలోచించమని! మీ బుద్ధికి

**నీ మనస్సును, నీ చేతలను, నీకు ఎన్ని అయితే శక్తులున్నాయో ఆ శక్తులన్నిటిని ఒక చోటకు తీసుకువచ్చి మొత్తం ఆ శక్తి అంతా లోపలికి మళ్ళించటమే గురువు చేసే పని.**

పదును పెట్టండి! మీ వివేకాన్ని పెంచుకోండి! మీ స్వరూపాన్ని సందర్శించండి! స్వరూపాన్ని సందర్శించని జన్మ వ్యర్థం! మనమందరం ఊహ తెలిసినది మొదలు "నేను నేను" అని అంటున్నాము. ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రించే వరకు ఈ "నేను" మనల్ని పిశాచంలా పట్టి పీడిస్తున్నది, దాని ఇష్టం వచ్చినట్టు ఆడిస్తున్నది. కాని ఈ "నేను" ఎవరో మనకి తెలియదు. ఈ "నేను" ఎవరో, దాని మూలం ఏమిటో తెలిసే వరకు ఏ జీవుడికి సుఖం లేదు, శాంతి లేదు, చావు పుట్టుకలు తప్పవు. మరి ఈ నేనుకు మూలం ఎక్కడ?

ప్రతీ మనిషి "నేను చెపుతున్నాను, నేను చెపుతున్నాను" అని గుండెల మీద కుడివైపునే చేయి వేసుకుంటాడు. అంటే ఆ నేనుకు మూలం అక్కడే ఉంది. అది ఆధ్యాత్మిక హృదయం - ఆత్మకు నిలయం! అనంతమైన, అఖండమైన, అద్వితీయమైన, అనిర్వచనీయమైన, అవ్యయమైన, అజరమైన, అభౌతికమైన, ఆత్మ గతమైన అసలు "నేను" అక్కడే ఉంది. నీటిలో నుంచి బుడగ వచ్చినట్లు ఈ ఆత్మగతమైన "నేను"లో నుంచే మనమంటున్న దేహ పరిమితమైన "నేను" అను తొలి తలంపు పుడుతున్నది. అదే అహంకారము. ఈ "నేను" అను తొలితలంపుకే మిగిలిన ఎన్నో తలంపులు వస్తున్నాయి. ఆ తలంపుల మూటే మనస్సు! మనకు రాగం వచ్చినా, ద్వేషం వచ్చినా, కామం వచ్చినా, క్రోధం వచ్చినా, లోభం వచ్చినా, మోహం వచ్చినా, అన్నీ ఈ పరిమిత "నేను"కే వస్తున్నాయి.

గాఢనిద్రలో ఈ "నేను" లేదు. అప్పుడు ఈ గొడవలు ఏమీ లేవు. చివరకు దేహం లేదు. లోకం లేదు. దేవుడు కూడా లేడు. కానీ మనము మాత్రం సుఖముగా ఉన్నాము. సుఖముగా ఉన్నామేగానీ సుఖముగా వున్న సంగతి నిద్రలో ఉండగా తెలియుట లేదు. మెలుకువ వచ్చాక మాత్రమే సుఖముగా ఉన్నామని చెపుతున్నాము. నిద్రనుంచి మేల్కొన్న వెంటనే మరల "నేను" అను తలంపు పుడుతున్నది. దాని వెనకాలే సైన్యం వచ్చినట్లు, మన గొడవలన్నీ గుర్తుకు వస్తున్నాయి -అశాంతిని తెస్తున్నాయి. మెలుకువలో మనము ఉన్నామని తెలుస్తున్నది. కాని మనము మాత్రం సుఖంగా లేము. గాఢనిద్రలో నున్న సుఖాన్ని మెలుకువలో నున్న ఎరుకను ఏకకాలంలో అనుభవంలోనికి తెచ్చుకోగలిగితే అదే మోక్షం!

**గురువు చూపు అనుగ్రహం, గురువు మాట అనుగ్రహం, గురువు చేత అనుగ్రహం, గురువు నీతో మాట్లాడినా అనుగ్రహమే. గురువు నీతో మాట్లాడక పోయినా అనుగ్రహమే. గురువు మౌనంగా ఉన్నా అనుగ్రహమే. గురువు యొక్క ప్రతి చేష్ట అనుగ్రహమే. గురువు ఏ పని చేసినా నిన్ను పవిత్రుడిని చెయ్యటానికీ. వాడే నిజమైన గురువు.**

మనము మోక్షం కావాలని కోరుకుంటున్నాము. కాని మనము మోక్షాన్ని కోరుకునేటప్పుడు కూడా మోక్షంలోనే ఉన్నాము. అయితే అది మన అనుభవం లోనికి రాకుండా మన పరిమితమైన "నేనే" అడ్డు పడుతున్నది. మన అన్ని అనర్ధాలకు మూలమైన ఈ "నేను ఎవరు?" అని మీరెప్పుడైనా ప్రశ్నించుకున్నారా? కనీసం ఈ రోజునుంచైనా ఈ "నేను ఎవరు?" అని విచారణ చేయండి! దాని అస్థిత్వాన్ని ప్రశ్నించండి! అప్పుడు ఈ నేను దానికి వచ్చే తలంపుల నుంచి విడివడి, అంతర్ముఖమై తన పుట్టు చోటును అన్వేషిస్తూ, హృదయము వైపు ప్రయాణము చేసి, తన పుట్టుక చోటైన ఆత్మను చేరుకుంటుంది.

"నేను ఎవడను?" అని విచారణ చేసి ఈ నేనును ఆత్మలో స్థిరముగా నిలిపి ఉంచగలిగితే తలంపుల వేగము తగ్గి మనస్సు పలుచబడుతుంది - పరిశుద్ధమౌతుంది. పరిశుద్ధమనస్సు ఆత్మాకారం చెందుతుంది. ఆత్మలో ఐక్యమయ్యే వరకూ ఏ జీవుడూ బంధములో నుంచి బయట పడలేడు. మీరు ఏ పని చేసినా హృదయశుద్ధి కోసమే చేయండి. శుద్ధి లేని వాడికి సిద్ది కలుగదు" అని బోధిస్తున్నారు శ్రీనాన్నగారు.

చివరి మాటగా శ్రీనాన్నగారు చెప్పేది, "మీకు శక్తి వుంటే సాధన చేసి తరించండి, సాధన చేసే ఓపిక లేకపోతే కనీసం ఒక సత్పురుషునితో సహవాసము చేయండి సమస్త సద్గుణాలూ మీకు సమకూరతాయి. సంసార సాగరాన్ని దాటిపోతారు," అంటున్నారు.

అందుకోగలిగిన వారికి అడ్డదారి కూడా చెపుతున్నారు శ్రీనాన్నగారు. "మనస్సు నిగ్రహించుకోవటాలు, సత్యాన్ని అన్వేషించటాలు, నీకెందుకు? నీవు మనస్సు కాదు, ఆత్మవు! నీవు కాని మనస్సు గొడవ నీకెందుకు? దానిని పట్టించుకోకు! దానిని ఖాతరు చేయకు! నీవు నీవుగా, ఆత్మగా, ఉండు! సరిపోతుంది, సాధనతో పనే లేదు," అంటున్నారు.

సత్యాన్ని రియలైజ్ చేయుట కోసం ఎందరో మహాత్ములు ఎన్నెన్నో మార్గాలు చెప్పారు. మీకు నచ్చిన మార్గాన్ని మీరు ఎంచుకొని మీ పద్ధతిలో మీరు ప్రయాణము చేయండి, మీరు ఎవరో మీరు తెలుసుకోండి, మీ జన్మలను జ్ఞానముతో పండించుకోండి. మీరు దుఖములో నుంచి బయట పడండి, మీరు శాంతిగా ఉండండి, మీ శాంతిని మీ తోటి వారికి పంచిపెట్టండి!

**గురువు యొక్క చూపు నీ మీద పడితే చాలు, నీవు పవిత్రుడవు అయ్యిపోతావు. నదుల్లో స్నానాలకంటే, విగ్రహాలు పూజించటం కంటే, తీర్థయాత్రలు చెయ్యటం కంటే, ఒక్క గురువు యొక్క చూపు బలీయమైనది.**



# Silent and powerful Teaching of Sri Nannagaru


## (శ్రీనాన్నగారి శక్తివంతమైన మౌన బోధ)

**పి. సంధ్య, హైదరాబాద్**

శ్రీనాన్నగారు చివరి శ్వాస వరకు మాటకి భాషకి అందినంతవరకు మనకి జ్ఞానాన్ని బోధించి అనుగ్రహించారు. ఆయన బోధల ద్వారా జ్ఞాని యొక్క మాటలకి ఉన్న శక్తిని తెలియచేస్తూ ఆ మాటలని మననం చేసుకోవటం వలన మనకి వచ్చే ఆనందాన్ని కూడా రుచి చూపిస్తున్నారు. నాన్నగారికి ప్రతి భక్తుడి తోటి పర్సనల్ టచ్ ఉండేది. అందువల్ల ఎవరికి ఏది అవసరమో దాన్ని అనుగ్రహించేవారు. ప్రతి విషయంలోనూ మన స్థాయికి దిగి మనకి అందేటట్లు చేసేవారు. ఇప్పుడు మనం ఉన్న పరిస్థితిలో సైలెంట్ అండ్ పవర్ఫుల్ గ్రేస్ అందజేస్తున్నారు. అంటే మనల్ని మన లోపలికి హృదయం వైపుకి లాగుతున్నారు.

ఆయన దేహం ద్వారా జరగవలసిన జ్ఞానబోధని పరిపూర్ణం చేసి ఇప్పుడు దేహ త్యాగం తరువాత మనలో వైరాగ్యాన్ని కలగచేసి ఆయన ఏ జ్ఞానాన్ని అయితే బోధించారో దాన్ని మనలో సుస్థిరం చేస్తున్నారు నాన్నగారు. "భగవాన్ శరీరంతో ఉన్నా లేకపోయినా నాకేమీ బేధం లేదు" అనేవారు. "ఈ దేహం ఉన్నా లేకపోయినా, భక్తులతో నా అనుబంధం కంటిన్యు అవుతుంది" అన్నారు నాన్నగారు. ఇప్పుడు మనం ఉన్న పరిస్థితులలో నాన్నగారికి భగవాన్‌తో ఉన్న అనుబంధం లాంటిది, మనకీ నాన్నగారికి మధ్య కూడా ఉండాలి అని మనందరికీ తెలియజేస్తున్నారు. భక్తుల పట్ల ఆయనకున్న ప్రేమ ఈ విధంగా వ్యక్తం చేసారు - "నా శరీరం మరణించినా, నేను వారి హృదయాలలో జీవించే ఉంటాను" అన్నారు.

చెప్పటము కాదు ఇవ్వటమే అని నాన్నగారు ఎప్పుడూ అంటూ ఉండేవారు. ఏ ఒక్కరికి ఇవ్వకపోయినా బాధపడతారు కదా, అందుకని అందరికీ ఇచ్చేద్దాం అనేవారు. ఆయన దయ అటువంటిది. ఆయన దయకి పాత్రులము అయినందుకు మనమందరం మన హృదయాలని ఆయనకి అర్పిద్దాము.




ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# గురుపూర్ణిమ

**(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణముల నుండి)**

**సేకరణ - బేబి, హైదరాబాద్**



భగవంతుడి వైభవం మన మనస్సు బుద్ధి గ్రహించలేవు. అందుచేత భగవంతుడే తన శక్తిని వైభవాన్ని అర్జునుడి ద్వారా మానవాళికి బోధించి వెల్లడించాడు. భగవంతుడిని మించిన వైభవం సద్గురువుది. గురువు అనుగ్రహం ఉన్నవాడు కర్మఫలదాత అయిన భగవంతుని ద్వారా వచ్చిన ప్రారబ్ధకర్మలని కూడా తేలికగా దాటగలడు. అట్టి గురువు వైభవం తెలుసుకోవటం మన చిన్న మనసులకు, బుద్ధికి ఎలా సాధ్యం? గురువు అనుగ్రహం, ఆయన వైభవం తెలియజేయటం గురువుకి మాత్రమే సాధ్యం. ఎన్నో సంవత్సరాలు ప్రతి గురుపౌర్ణమికీ ప్రేమస్వరూపులైన మన సద్గురువు శ్రీనాన్నగారు ముఖతా ఆ గురువు వైభవం గురించి విని ఆస్వాదించగలగటం మనం ఎన్నో జన్మలలో చేసుకొన్న పుణ్యమే కాదు, అది మన పట్ల ఆయన అనుగ్రహం. శ్రీనాన్నగారు గురుపూర్ణిమ వేడుకల సందర్భంగా ఎన్నోసార్లు గురువు ఔన్నత్యాన్ని వెల్లడించారు. వాటిలో కొన్ని అనుగ్రహ వాక్యాలను గుర్తు చేసుకొందాము.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

వ్యాసుడు జన్మించిన రోజును వ్యాసపూర్ణిమ అంటారు. వ్యాసపూర్ణిమనే పురాతన కాలమునుండి గురుపూర్ణిమగా జరుపుకుంటూ వస్తున్నారు. గురువులకు గురువు, ఋషులకు ఋషి, కవులకు కవి, భారతీయ సాహిత్యమునకు పితామహుడు అయినటువంటి వ్యాసుడి జన్మదినమే వ్యాసపూర్ణిమ. హిందూమతానికి ఒక ఫౌండర్ లేకపోయినా హిందూమతానికి మూలపురుషుడు వ్యాసుడు. వ్యాసుడు విష్ణువు యొక్క అంశ అని పెద్దలు చెపుతారు. ఆయన వేదాలను విభజించాడు, మహాభారతం వ్రాసాడు. ఆ మహాభారతంలోనే భగవద్గీత ఉంది. బాగుపడాలంటే భాగవతం చదవాలి అంటారు. దానిని రచన చేసినది వ్యాసుడు. వేదాలలో ఏ బ్రహ్మం అయితే ప్రతిపాదించబడిందో ఆ బ్రహ్మం గురించి అవగాహన అవ్వటం కోసం, మన మెదడుకు పట్టటం కోసం, బ్రహ్మసూత్రాలు రచించాడు వ్యాసుడు. ఆయన మనకు జ్ఞానభిక్ష పెట్టాడు.అటువంటి మహాపురుషుడు, ఈశ్వర స్వరూపుడు అయిన వ్యాసుడిని గౌరవించటం కోసం ఈ రోజును వ్యాసపూర్ణిమగా, గురుపూర్ణిమగా మన పెద్దలు నిర్ణయించారు.

అందరూ ఒక గురువునే ఆరాధించాలని కాదు. ఎవరికి ఇష్టమైన గురువును వారు ఆరాధించుకోవటం కోసం మన పెద్దలు ఈ రోజును నిర్ణయించారు. గురుపూర్ణిమ రోజున ఎవరి గురువును వారు ఆరాధించుకొంటారు. గురువును స్మరించుకోవటం వలన,

గురువును ధ్యానించటం వలన జ్ఞానం కలగటానికి సరియైన పునాది పడుతుంది.

గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే శివుడు. అంటే దాని అర్థం బ్రహ్మ చేసే పని, విష్ణువు చేసే పని, శివుడు చేసే పని ఒక్క గురువే చేస్తాడు. గురువు అంటే ఆత్మ, చైతన్యం, బ్రహ్మము. ఈ మూడు ముఖాలలో నుంచి వచ్చేది ఒక ముఖంలోంచే వచ్చేస్తుంది. సమస్త దేవతలందరి పనీ గురువే చేస్తాడు. నీ లోపల ఉన్న చైతన్యమే నిజమైన గురువు. గురువంటే అనుగ్రహం. గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా, ఆత్మ అన్నా ఒక్కటే. ఉన్నది ఒక్కటే వస్తువు అదే గురువు. ఆ సద్వస్తువు నీ హృదయం లోనే ఉంది. నీ హృదయంలో ఉన్న సద్వస్తువే కాళ్ళు చేతులు తొడుక్కొని గురువుగా వస్తుంది. గురువు వేరు ఆత్మ వేరు కాదు. గురువు దేహంలో ఉన్న చైతన్యంతో తాదాప్యం పొంది ఉంటాడు. మనలని అనుగ్రహించటానికి రూపం ధరించిన బ్రహ్మమే గురువు.

మనలోని అజ్ఞానమును తొలగించేవాడే గురువు. గురువు ఈశ్వరునితో సమానము. ఆత్మ, గురువు, చైతన్యం, ఈశ్వరుడు ఒక్కటే అన్నారు భగవాన్. నాకు గురువు లేడు కానీ ఇతరులకు గురువు అవసరం లేదు అని నేను ఎప్పుడూ చెప్పలేదు, గురువు అవసరమే అన్నారు భగవాన్. గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు. బయట ఉన్న చీకటిని సూర్యుడు పోగొడుతున్నాడు. నీ లోపల ఉన్న చీకటిని సూర్యుడు పోగొట్టలేడు. గురువు మాత్రమే పోగొట్టగలడు. తల్లితండ్రులు, బంధువులు, స్నేహితులు మనకు భౌతికమైన అవసరాలను తీర్చగలరు. మీ దుఖాన్ని హరించేవాడు, మీలోని అశాంతిని తొలగించేవాడు గురువు మాత్రమే. గురుపూర్ణిమ రోజున ఎవరి గురువును వారు ఆరాధించుకోవచ్చు.

గురువు సన్నిధిలో ఉన్న పరమశాంతి వలన, గురువు అనుగ్రహం వలన, ప్రేమ వలన, నీకు తెలియకుండా నెమ్మదిగా వాసన పల్చబడుతూ వస్తుంది. అది నీకు తెలియదు. నీవు ఎంతవరకూ ఆధ్యాత్మికంగా అభివృద్ధి అయ్యావో నీకు తెలియదు. అది నిర్ణయించేది గురువు ఈశ్వరుడు మాత్రమే. గురువు అనుగ్రహం లేకుండా, కేవలం నీ తెలివితేటల వలన వాసనని జయించలేవు. వాసన నశించాలంటే గురువు అనుగ్రహం అవసరము. వాసన నశించకుండా నీవు మోక్షశాంతిని, నిర్వాణసుఖమును పొందలేవు.

పునర్జన్మకు కారణం వాసన. పూర్వజన్మలలో నీవు అనుభవించిన రుచులే, భోగాలే, వాసన క్రింద మారతాయి. ఈ వాసనలు నశిస్తేగానీ నీవు మరణంలేని స్థితి పొందలేవు. గురువు సమక్షంలో నీ వాసనలు ఎంతోకొంత పల్చబడతాయి. నీ అంతట నీవు వాసనలు

**మనందరికీ పెద్ద చుట్టం గురువే. గురువు అనే పెద్ద చుట్టంతో నీవు మానసిక అనుబంధం పెట్టుకుంటే, ఆ గురువుతో నీకు ఉన్న అనుబంధమే నీమనస్సుని హృదయంలోనికి నెట్టివేస్తుంది. అది ఆధ్యాత్మికంగా వచ్చే లాభం.**

జయించాలి అంటే అది నీ వల్ల కాదు. నీ శరీరానికి వయస్సు చాలా తక్కువ. నీ వాసనల యొక్క వయస్సు చాలా ఎక్కువ. అందువలన, ఏదో గుంజీలు తీసాను, ఏదో సాధన చేసాను అంటే వాసన నశించదు. నీ శరీరానికి ఉన్న వయస్సు కంటే, నీ సాధనకు ఉన్న వయస్సు కంటే వాసనకు ఉన్న వయస్సు చాలా ఎక్కువ. మనకంటే బలమైన వాడితో పేచీ పెట్టుకుంటే, వాడితో కుస్తీ పడితే వాడి చేతిలో మనం ఓడిపోతాము. మన బలం ఎక్కువ ఉంటే వాడిని ఓడించవచ్చు. అదేవిధంగా వాసన కంటే నీ సాధనాబలం ఎక్కువగా ఉంటే వాసన నశిస్తుంది. వాసన బలం ఎక్కువ, నీ సాధన బలం తక్కువ అయితే వాసన నశించదు.

ఈశ్వరుడు మోక్షం ఇచ్చేటప్పుడు ఒక్కటే చూస్తాడు. నీలో ఉన్నది అహంకార భక్తా, అహంకారము లేని భక్తా అని చూస్తాడు. రాముడికీ భక్తి ఉంది, రావణాసురుడికీ భక్తి ఉంది. రాముడి భక్తి అహంకారము లేని భక్తి. రావణాసురుడికి శివుడు అంటే భక్తి, కానీ అతనిది అహంకారముతో ఉన్న భక్తి. అహంకారముతో కూడిన భక్తి వలన రావణాసురుడు రాక్షసుడు అయ్యాడు. రాముడిది అహంకారము లేని భక్తి కాబట్టి ఆయన దేవతాస్వరూపుడు అయ్యాడు. మనం అందరము రామ రామ అని ఆయనని ఆరాధిస్తున్నాము.

రమణమహర్షి గారు ఏమి చెప్పారు అంటే, నీవు ధ్యానం చేస్తున్నావు అనుకో, నీవు చేసే ధ్యానం వలన ఆ ధ్యానం చేసేవాడు నశించాలిగానీ వాడు బలపడుతూ ఉంటే నువ్వు కోటిజన్మలు ఎత్తినా నీకు మోక్షం రాదు అని చెప్పారు. మీది ఏ ఊరు? మీ కులం ఏమిటి? మీ గురువు ఎవరు? మీరు ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నారు? అటువంటి గొడవలు ఏమీ భగవంతుడికి అక్కరలేదు. ఇవి అన్నీ నీ మనస్సుకు సంబంధించినవి. నీలో అహంకారబుద్ధి ఉందా లేదా అని చూస్తాడు. అహంకార బుద్ధి ఉంటే ప్రకృతిలోనికి గెంటేస్తాడు. అది లేకపోతే ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. ఒక్క సత్యము తప్పించి అన్నీ కూడా నీ మనస్సు యొక్క కల్పితములు అన్నారు భగవాన్. అందుచేత నీ మనస్సు నశిస్తే ఏమీ లేదు. మనోనాశనం వేరు, మనస్సు అణగటం వేరు. మనస్సుని నమ్మటానికి వీలులేదు. అణిగిన మనస్సు ఎప్పుడైనా విజృంభించే అవకాశం ఉంది. మనస్సు నశిస్తే వాడు యోగి అవుతాడు.

నేను ఏమీ ప్రయత్నం చేయను, గురువు కూడా తిరుగుతూ ఉంటాను అనుకోండి, గురువు యొక్క చైతన్యస్థాయి నాకు ఏమైనా ఉపయోగపడుతుందా లేక నేను ఏమైనా ప్రయత్నం చేయాలా అని ఒక భక్తుడు భగవానుని అడిగారు. మహాత్ముల సమక్షంలో వాసన అణుగుతుంది అని చెప్పారు భగవాన్. నా దగ్గర వాసనలు అణుగుతాయి అని చెప్పటంలేదు. ఆయన ఏది చెప్పినా జనరల్‌గా చెపుతారు. అది ఆయనలోని ప్రత్యేకత.

**ఈశ్వరునిలో ఉన్న దయాభాగమే గురువుగా వచ్చింది. రక్షించే భాగము వచ్చింది కాని శిక్షించే భాగం రాలేదు. నీలో ఉన్న భగవంతుడే గురురూపం ధరించి భూమి మీదకి వస్తాడు. గురువు అంటే "గ్రేస్ అఫ్ ఈశ్వర .. కంపేషన్ అఫ్ ఈశ్వర"!**

గురువు సమక్షంలో నీకు జ్ఞానం కలుగుతుంది. పొందవలసినది ఏదో గురువు అనుగ్రహం వలన పొందుతావు. సందేహపడవద్దు. అయితే నీ బలహీనతలు ఏమిటో నువ్వు చూసుకోవాలి. నీ బలహీనతలు గురువుకు తెలుస్తూ ఉంటాయి. గురువు అనుగ్రహిస్తూ ఉంటాడు. నీవు చిన్న ప్రయత్నం చేసినా గురువు సహాయం నీకు అందుతుంది. నీ మనస్సును ముడుచుకోకూడదు. మనస్సును ఓపెన్ చేసి ఉంచు. ఎవరైనా మంచిమాట చెప్పినప్పుడు, దానిని సహృదయంతో స్వీకరించాలి. అప్పుడు నీలోపల ఉన్న చీకటి పోతుంది.

గురువు అనుగ్రహం వలన చైతన్యం యొక్క రుచి కొంచెం కొంచెం తెలుస్తుంది. చైతన్యం యొక్క సుఖం, శాంతిని గురువు కొంచెం కొంచెం చూపిస్తాడు. ఎంతో కొంత మీరు ప్రయత్నం చేసి దానిని సొంతం చేసుకొంటే, అది శాశ్వతం అవుతుంది. గురువు అనుగ్రహానికి ఎవడైతే పాత్రుడయ్యాడో, వాడు ఒక జన్మ వెనకో ముందో మోక్షాన్ని పొంది తీరుతాడు. ఈ విషయంలో సందేహం అక్కరలేదు. గురువు అనుగ్రహంలో పడినవాడు రక్షింపబడతాడు గానీ గురువు వాడిని విడిచి పెట్టడు.

ఒక భక్తుడు భగవాన్‌తో మీరంటే నాకు చాలా ప్రేమ ఉంది, కానీ నేను ఈ జీవితంలో అన్నీ నరకానికి వెళ్ళే పనులు చేసాను. నాకు కూడా మోక్షం వస్తుందా? అని అడిగాడు. నీవు నరకానికి వెళితే నీకోసం నేను కూడా నరకానికి వస్తాను అన్నారు భగవాన్. అది గురువు ప్రేమ!

శరీరం మరణించినప్పుడు బంధువులతోటి, స్నేహితులతోటి ఉన్న సంబంధం తెగిపోతుంది. కాని గురువుతో ఉన్న సంబంధం తెగదు. నీవు ఎక్కడ జన్మించావు అని గురువు చూస్తూ ఉంటాడు. నిన్ను వెంటాడతాడు. ఆయన స్వరూపాన్ని నీకు ఇచ్చేవరకూ ఆయన విశ్రమించడు. మధ్యలో మీకు గురువు మీద ప్రేమ పోయినా, గురువు మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటాడు. అది గురువు యొక్క స్థితి.

ప్రయత్నం అనేది లోపల జరుగుతుంది. బయట జరగదు. నేను లోపల సాధన చేసుకొంటున్నాను. బయట గురువు దగ్గర కూడా కూర్చోమంటారా అని అడుగుతున్నారు. బయట గురువు కూడా అవసరమే. నీకు ఉన్న వాసనలు నశించేవరకూ బయట గురువు అవసరమే అన్నారు భగవాన్. అన్వేషణ లోపల చేసుకోవచ్చు. నీవు లోపల చేసుకొనే అన్వేషణకు బాహ్య గురువు సహాయం చేస్తాడు. నీకు లోపల గురువు దొరికే వరకూ, బయట గురువు నిన్ను వెంటాడతాడు. లోపల గురువు చైతన్యమే.

ప్రయత్నం లేని స్థితి నిజమైన స్థితి. ప్రయత్నం అనేది సాధనము మాత్రమే. అది గమ్యం కాదు. ప్రయత్నం కూడా బంధమే. అలాగని ప్రయత్నం చేయవద్దు అని కాదు. ప్రయత్నం ఉంది అంటే దుఖం వచ్చేస్తుంది. ప్రయత్నం లేని స్థితిని నీవు పొందినప్పుడు ఆనందం నీకు అందుతుంది. దేహంతో తాదాప్యం పొందటానికి నీవు ఏమీ ప్రయత్నం చేయటంలేదు. నీ

ప్రయత్నం లేకుండా ఇప్పుడు దేహంతో ఎలా తాదాప్యం పొందుతున్నావో, అలాగ సహజంగా ప్రయత్నం లేకుండా చైతన్యముతో తాదాప్యం పొందాలి.

ఒక మనిషి భౌతికంగా అభివృద్ధి లోనికి రావాలంటే ఏకాగ్రత అవసరం. వాడికి జ్ఞానం కలగాలంటే ఏకాగ్రతకు తోడుగా పవిత్రత ఉండాలి. నేను ఏకాగ్రత కోసం ప్రయత్నం చేస్తున్నాను, దానికి కొంత సహాయం అవసరం అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. మీరు సహాయం చేయండి అని చెప్పకుండా చెపుతున్నాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే, ఏకాగ్రత పెంచుకోవటం కోసం అనుగ్రహం కావాలి. అది దానంతట అదే వస్తుంది. ప్రత్యేకంగా అడగనక్కర లేదు. నీ అనుగ్రహం కావాలి అని గురువుని అడగనక్కరలేదు.

నీకు ఏది కావాలో నీకంటే ముందుగా గురువుకు తెలుస్తూ ఉంటుంది. ఏకాగ్రత పవిత్రత కేవలం నీ ప్రయత్నం వలన పెరగవు. గురువు అనుగ్రహం అవసరము. నీ ఏకాగ్రతను పవిత్రతను పెంచే శక్తి అనుగ్రహం. అనుగ్రహం కావాలి అని ప్రత్యేకంగా అడగనక్కరలేదు. అనుగ్రహం దానంతట అదే గురువు హృదయం నుండి ప్రవహిస్తూ ఉంటుంది. ఏకాగ్రత పవిత్రత పెరగటం కోసం మహాత్ములకు పెద్దలకు సేవ చెయ్యి అన్నారు.

సత్పురుషుల సహవాసం వలన జ్ఞానం సంపాదించాలనే కాంక్ష కలుగుతుంది కానీ కేవలము దేహానికే పరిమితమైన బుద్ధి ఉన్నవారి సహవాసం వలన నీకు ఆత్మజ్ఞానం సంపాదించాలనే కాంక్ష కూడా కలగదు.

ఒక మహాత్మునితో కానీ, గురువుతో కానీ మానసిక అనుబంధం పెట్టుకోండి. శరీరాలు ఎక్కడ ఉన్నా ఒకటే. ఇంజనుకు తగిలించిన పెట్టెలను ఇంజన్ ఏవిధంగా అయితే లాగుకొని పోతుందో, గురువుతో మానసిక అనుబంధం పెట్టుకుంటే ఆయనే మనలను లాగుకొనిపోతాడు. భగవంతునితో మానసిక అనుబంధం పెట్టుకుంటే ఆయనే మన మనస్సును అంతర్ముఖం చేసేస్తాడు. ఏవిధంగా అయితే నీ మనస్సుతో విషయాలను చింతిస్తున్నావో అలాగ నీ మనస్సుతో భగవంతుని చింతిస్తూ ఉంటే, ఆయనే లోపలకు గుంజుకొంటాడు. లోపలకు గుంజుకొని నిన్ను వదిలేయడు. వాడి స్వరూపాన్ని నీకు ఇస్తాడు. అదే మోక్షం. ఒక్కసారి మన వంక చూస్తే చాలు, ఈ మనస్సుని మన చేతికి అందేలా చేస్తే చాలు, తరువాత పని మనం చేద్దాము అని భగవంతుడు చూస్తున్నాడు. కానీ ఈ మనస్సు వాడి చేతికి అందేటట్లు మనం చేయటం లేదు.

విషయచింతన వలలాంటిది. ఈ జీవులు అందరూ అందులో పడిపోతున్నారు. చేపలు పట్టటం కోసం వల వేస్తాడు ఆ వలవేసే వాడి పాదాల దగ్గరకు చేరిన చేపలు ఆ వలలో పడవు. మాయ అనే వల వేసేవాడు ఈశ్వరుడు. ఈశ్వరుడిని ఎవడైతే చింతిస్తున్నాడో వాడు మాయ అనే వలలో పడడు. వాడు రక్షింపబడతాడు.

నీ హృదయంలో ఒక చావులేని వస్తువు ఉంది. ఆ చావులేని వస్తువునే దక్షిణామూర్తి

మాటలతోటి ఉపన్యాసములతోటి కాకుండా మౌనంగా ప్రకటించాడు. ఎదుటివారికి పక్వత ఉన్నప్పుడు పెద్ద పెద్ద ఉపన్యాసములు అక్కరలేదు. ఒక్క చూపు సరిపోతుంది, ఒక్క స్పర్శ సరిపోతుంది వారు జ్ఞానులు అయిపోతారు. సనత్కుమారుడు వాళ్ళు పండిపోయి ఉన్నారు. దక్షిణామూర్తి మౌనం వలననే వారికి హృదయంలో ఉన్న నిజతత్వం ప్రకటితమయ్యింది.

మన హృదయంలో ఉన్న సత్యవస్తువే నిజమైన గురువు. ఆ సత్యవస్తువును సాధించటం కోసం మనం ఎప్పుడైతే మినహాయింపులు లేకుండా ప్రయత్నం చేస్తున్నామో, అప్పుడు ఆ వస్తువే గురు రూపం ధరించి వస్తుంది. మన మనస్సు బాహ్యముఖమునకు విజృంభిస్తూ వుంటుంది. బయట రూపము ధరించి వచ్చిన గురువు బాహ్యముఖముగా విజృంభిస్తున్న మనస్సును లోపలకు నెట్టుతాడు. నిజమైన గురువు లోపల ఉన్నాడు. బాహ్యగురువు మనస్సును ఎప్పుడైతే లోపలకు నెట్టుతున్నాడో, నిజమైన గురువు దానిని లోపలకు గుంజుకుంటాడు.

ఎన్ని శాస్త్రములు చదివినా, ఎన్ని వేదములు చూసినా, మనోనిగ్రహం ప్రధానము అని చెప్పారు. మనోనిగ్రహమే ప్రధానము అని చెప్పిన తరువాత కూడా నీ మనస్సును స్వాధీనం చేసుకోవటం కోసం ప్రయత్నం చేయటం మానివేసి, అదే పనిగా శాస్త్రములు చదువుతూ ఉంటే పాండిత్యము వస్తుందిగానీ నీకు మనోనిగ్రహము రాదు అని భగవాన్ చెప్పారు.

సాధకుల మనస్సును నిర్మలం చేయటం కోసం, నిశ్చల పరచటం కోసం, గురువు తదేకంగా ప్రయత్నం చేస్తాడు. మనస్సు నిర్మలం. అవ్వాలి. మనస్సు నిర్మలం అవ్వకపోతే గురువు మాటలు శ్రవణం చేసినా, శాస్త్రములు పఠించినా, మహాత్ములను దర్శించినా, జ్ఞానము నీకు అంటదు. నిర్మలమైన మనస్సుకు జ్ఞానం అంటుకుంటుంది కానీ చపలత్వం ఉన్న మనస్సుకు జ్ఞానం అంటదు. జ్ఞానం కావాలంటే మనస్సు నిర్మలం అవ్వాలి. మనస్సుకు కుదురు రావాలి, దుర్బలత్వం తగ్గాలి. అవసరము లేని విషయముల లోనికి మనస్సు వెళుతూ ఉంటే దుర్బలత్వం ఉన్నట్లు గుర్తు. దుర్బలత్వం ఉంది కాబట్టి మనస్సు ప్రకృతి వైపుకు విజృంభిస్తోంది. మనస్సు ప్రకృతి గుణాల వైపుకు ప్రయాణిస్తే ప్రకృతి అంటుకుంటుంది. అదే మనస్సు దేవుని వైపుకు ప్రయాణిస్తే జ్ఞానము కలుగుతుంది.

ఏది నిజమో మనకి తెలియకపోయినా మనం పూజించే ఈశ్వరునికి తెలుసు. మనస్సు ఈశ్వరుని వైపుకు పరుగులు తీస్తూ ఉంటే ఆయన స్వరూపం ఇస్తాడు. ఆయన స్వరూపమే ఆత్మజ్ఞానము. అదే బ్రహ్మము, అదే సత్యము. దానిని ఆయన అనుగ్రహం వలన పొందాలి. దీనికి భగవాన్ మూడు మెట్లు చెప్పారు. 1. స్వప్రయత్నం, 2. కాలపరిపక్వము, 3. ఈశ్వరకటాక్షము. సోమరితనం లేకుండా మనం చేసే ప్రయత్నం ఏదో మనం చెయ్యాలి. కపటం లేకుండా చెయ్యాలి. చిన్నపని కదా అని తేలిక భావంతో చేయకూడదు. తిరస్కార బుద్ధి లేకుండా పురస్కారంతో చేయాలి.

నేను అన్నప్పుడు మనకు దేహం జ్ఞాపకం వస్తుంది. ఇంద్రియాలు జ్ఞాపకం వస్తాయి, మనస్సు జ్ఞాపకం వస్తుంది, మనస్సు అనే పెట్టెలోని గొడవలు జ్ఞాపకం వస్తాయి. కృష్ణుడు గీతలో మనకంటే ఎక్కువసార్లు నేను, నేను అని వాడాడు. కాని కృష్ణుడు నేను అన్నప్పుడు విశ్వాత్మ భావన, బ్రహ్మ భావన, అభేద భావన స్ఫురిస్తోంది. మనం నేను అన్నప్పుడు దేహమే స్ఫురిస్తుంది. కానీ కృష్ణుడు నేను అన్నప్పుడు దేహం స్ఫురించటం లేదు. బ్రహ్మ భావన, అఖండ భావన స్ఫురిస్తోంది. నేను అన్నప్పుడు కృష్ణుడికి ఎలా బ్రహ్మభావన స్ఫురిస్తోందో అలాగే మనకు కూడా నేను అన్నప్పుడు బ్రహ్మం స్ఫురిస్తే ఇప్పుడే ఇక్కడే బ్రహ్మానుభవం కలుగుతుంది. కర్మ సముద్రమును దాటి ఒడ్డుకు రాగలుగుతాము.

గురువు అంటే ఆత్మ. పూర్వజన్మలలో ఏ గురువుతో అనుబంధం ఉందో వారి మీద మనకు ఆప్యాయత కలుగుతూ ఉంటుంది. జన్మాంతరములో ఏదో అనుబంధం లేకపోతే మనం ఇప్పుడు ఇలా కూర్చొని మాట్లాడుకోవటం కూడా జరగదు. ఒకరు భగవాన్ తో నేను మీ దగ్గరకు చాలా సార్లు వచ్చాను. మీరు నన్ను శిష్యుడు అని అనటంలేదు ఇంకో గురువును ఎవరినైనా చూసుకోమంటారా అని అడిగారు. నువ్వు ఇంకో చోట గురువును వెతుక్కునే యోగం ఉండి ఉంటే ఇక్కడకు వచ్చి ఉండే వాడివే కాదు అన్నారు భగవాన్. నువ్వు ఈ గేటు ద్వారానే మోక్షం పొందాలి. తాత్కాలికంగా నేను మాట్లాడటం లేదు అని ఎక్కడికైనా వెళ్ళినా ఈ గేటు దగ్గరకు తిరిగి రావలసిందే అన్నారు. అది జన్మాంతర అనుబంధం. ఒకో గురువు ద్వారా కొంత మంది జీవులు తరింప బడతారు. ఇది ఈశ్వరుని నియమము.

భగవాన్ దగ్గర కొంతమంది కూర్చున్నారు. ఎవరో కొత్తగా వచ్చి వీరు ఎవరండీ అని అడుగుతున్నారు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే, ఎవరో అయితే మన దగ్గరకు ఎందుకు వస్తారు, వీరు అందరూ మన వాళ్ళే. మన వాళ్ళు కాబట్టే మన దగ్గరకు వచ్చారు అన్నారు. మనం కష్టపడి చదివే కంటే చెప్పే గురువు ఉన్నప్పుడు శ్రవణం చేయటం మంచిది. అధ్యయనం చేసినప్పుడు కంటే, మనం శ్రవణం చేస్తూ ఉంటే ఆ విషయం మనకు బాగా అర్థం అవుతుంది. శ్రవణం చేసినప్పుడు మనకు ఏదైనా డౌటు వస్తే క్లారిటీ కోసం గురువును అడుగుతాము. గురువు ఉంటే మనం తక్కువ కష్టంతో ఎక్కువ నేర్చుకోవచ్చు. ఆత్మానుభవం, శాస్త్రజ్ఞానం రెండూ ఉన్నవారు చాలా తక్కువ మంది ఉంటారు. మనకు అవకాశం ఉంటే, గురువు దొరికితే ఆయన ద్వారా శ్రవణం చేయటం మంచిది.

రామకృష్ణుడు మొత్తం టైము అంతా శిష్యులకే ఉపయోగించేవాడు. వారు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటం గురించే నిరంతరం ఆలోచించేవాడు. అదే పని తప్ప ఆయనకు ఇంకో పని లేదు. గురువు ప్రేమ శిష్యుడి మీద ఎలా ఉంటుంది అంటే రామకృష్ణుడు ఇంకో గంటకు శరీరం విడిచిపెడతాడు అనగా నరేన్‌ను మంచం దగ్గరకు పిలిచాడు. నా శరీరం విడిచిపెట్టే టైము దగ్గరకు వచ్చింది. మానవజాతికి నువ్వు

ఉపయోగపడతావు అని నాకు విశ్వాసం ఉంది. అందుచేత నేను సంపాదించుకొన్న ఈ ఆధ్యాత్మిక సంపదను అంతా నీకు ధారపోసి నేను బీదవాడిని అయిపోయి ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోతున్నాను. నరేన్ నీకు డౌట్ చేసే స్వభావం ఉంది. అందుచేత నీకు ఏమైనా సందేహాలు ఉంటే తీర్చుకో. హృదయంలో ఉన్న సద్వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకు ఏవో సందేహాలు నిన్ను వెంటాడుతూ ఉంటాయి. అలా వెంటాడే వాటిని ఛేదించు. శాస్త్ర వాక్యాన్ని, గురువు వాక్యాన్ని ప్రమాణంగా తీసుకో అని చివరగా నరేన్‌తో రామకృష్ణుడు చెప్పాడు. సాధకుడికి అన్నిటికంటే గురువు అనుగ్రహం ముఖ్యం. మనం సందేహాలను ఛేదించాలి. సందేహాలను ఛేదించక పోతే గురువు చెప్పిన మాట మన హృదయంలో నిలబడదు. మనం ప్రతిదానికీ సందేహించకూడదు. నీ అహంకారం నీకు ప్రమాణం కాదు, నీ గుణాలు నీకు ప్రమాణం కాదు, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో అని పరమాత్మ చెప్పాడు.

భగవాన్ ప్రాణం పోయేటప్పుడు ప్రయాస ఏమీ కనబడలేదు. శ్వాస వస్తూ ఉంటుంది, వెళుతూ ఉంటుంది కదా. తరువాత వచ్చే శ్వాస రాలేదు అంతే. అప్పుడు ఒక కాంతి బయలుదేరి అరుణగిరిలో అదృశ్యమయ్యింది. జ్ఞాని యొక్క ప్రాణం ప్రయాణం చెయ్యదు. దాని మూలంలో మిళితం అవుతుంది అని చెపుతారు. అరుణాచలేశ్వరుడే భగవాన్ రూపంలో వచ్చాడు. ఆయనకు ఈయనకు తేడా ఏమిటంటే అది కదలని కొండ, ఈయన కదిలే కొండ. ఆ రూపమే ఈ రూపం ధరించి బోధ చేయటం కోసం వచ్చింది. రమణమహర్షి తిరుచ్చుళి నుండి అరుణాచలం వచ్చాడు అని చెపుతారు. అలా కాదు, అరుణాచలేశ్వరుడే తిరుచ్చుళి వెళ్లి మరల అరుణాచలం వచ్చాడు. మనం ఇప్పుడు నరసాపురంలో ఉన్నాము అనుకోండి, మనం నరసాపురం నుండి అరుణాచలం వెళ్ళాము అనుకొంటున్నాము. అలా కాదు, మనం అరుణాచలం వాళ్ళమే. అరుణాచలం నుండి నరసాపురం వచ్చాము. మరల అరుణాచలం వెళ్ళటానికి ప్రయత్నం చేస్తున్నాము. తిరగ బోర్లా వేసుకొంటున్నాము.

భగవాన్ యొక్క దేహము పడిపోయే రోజున, భగవాన్‌తో కొందరు మీరు ఇక్కడ ఉన్నారు అని మా దేశములు విడిచిపెట్టి వచ్చాము. కాని ఇప్పుడు మీరు వెళ్లిపోతున్నారు. మేము ఉండిపోతున్నాము అన్నారు. అప్పుడు భగవాన్ వారితో పూర్వం ఏదో జన్మలో సంబంధం లేకుండానే మనం ఇక్కడ కలిసామా, ఈ సంబంధం మనలను వేరొకచోట కలపదా అన్నారు.

దేహము పడిపోయిన వెంటనే బంధువుల తోటి, స్నేహితుల తోటి, పరిసరముల తోటి ఉన్న సంబంధము తెగిపోతుంది కానీ, గురువుతో ఉన్న సంబంధము తెగదు. గురువుతో ఉన్న సంబంధము ఎటువంటిది అంటే, మనం కనబడని సంకెళ్ళతో బంధింపబడి ఉంటాము. ఆయన అనుగ్రహము నుండి తప్పించుకొనే అవకాశము లేనే లేదు. జన్మ జన్మలకు మన కూడా వస్తూ ఉంటాడు.

ఈ దేహము మరణించి అహంకారమునకు వేరొక దేహము వచ్చినప్పటికీ వాడు


ఎక్కడ ఉన్నాడు, ఏమి చేస్తున్నాడు, వాడిని ఏ విధంగా సంస్కరించాలి, ఏ విధమైన సమర్ధత కలుగజేయాలి అని గురువు చూస్తూ ఉంటాడు. బ్రహ్మానుభవం కలుగకుండా ఏ వాసనలు అడ్డు వస్తున్నాయో చూసి, వాటిని తగ్గిస్తూ, వాడిని తయారు చేసి, టైము చూసి వాడిని హృదయం లోనికి గుంజుకుంటాడు. వాడి జీవలక్షణములు తీసుకొని, ఆయన స్వరూపముతో వాడిని అలంకరిస్తాడు.

గురువు యొక్క అనుగ్రహం పొందితే తప్పనిసరిగా జ్ఞానం పొందటానికి అర్హులము అవుతాము. అలాగ ఆయన మనలను తయారు చేస్తూ ఉంటాడు. మన శరీరమును తలుపు సందున పెట్టి నొక్కితే ఎంత బాధగా ఉంటుందో అలాగ మన మనస్సును ఒకోసారి నొక్కుతూ ఉంటాడు. మనస్సును నొక్కితే గాని అది కక్కదు. మనస్సులో ఉన్న వాసనలు తీసివేయటం కోసం అటువంటి సన్నివేశాలు కల్పిస్తూ ఉంటాడు. గురువు యొక్క ఆగ్రహం కూడా అనుగ్రహము అని భావించిన శిష్యుడు అదృష్టవంతుడు.

నీ లోపల ఉన్న బలహీనతలను అంతర్యామిగా ఉన్న గురువు నీకు చూపిస్తూ ఉంటాడు. వాటిని తొలిగించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే ఆయన సహాయం అందిస్తాడు. గురువు అనుగ్రహంలో పడ్డవాడు ఈ నాటికైనా ముందు నాటికైనా తరించి తీరతాడు. గురువు అనుగ్రహం బలీయమైనది. లోపల ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి నీలో ఉన్న ఏ గుణాలు, ఏ బలహీనతలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తొలిగించు కోవటానికి ఈ శరీరం భూమి మీద తిరుగాడుతున్నప్పుడే సాధన చెయ్యి. సందేహాలు పెట్టుకోవద్దు. సందేహాలు పెట్టుకొంటే నీకు లోచూపు రాదు. నీకు సందేహాలు ఉంటే గురువును ఆశ్రయించి, వినయంగా అడిగి వాటిని తొలిగించుకో. మీకు అవకాశం ఉంటే సజ్జనుల సమక్షంలో, మహాత్ముల సమక్షంలో, ఒక గంట కూర్చోండి. అలా కూర్చోవటం వలన వారి వైబ్రేషన్స్ మీ మీద పని చేస్తాయి. మీ మనస్సుకు తొందరగా లోచూపు కలుగుతుంది. ఆచార్యులవారు బోధస్వరూపులు. రాముడు, కృష్ణుడు బయట రాక్షసులను చంపితే, ఆచార్యులవారు ఆయన బోధ ద్వారా లోపల ఉన్న రాక్షసులను చంపటానికి ప్రయత్నం చేసారు.

నీ దేహం ఎక్కడ ఉన్నా, గురువుతోటి, ఈశ్వరుడి తోటి మానసిక అనుబంధం పెట్టుకో. గురువుతోటి, పరమేశ్వరుడితోటి మానసిక అనుబంధం పెట్టుకొంటే, నది ఏ విధంగా సముద్రంలో కలిసిపోతుందో అలాగ నీ మనస్సు వెళ్లి చైతన్యంలో ఐక్యమవుతుంది.

గురువు యొక్క అనుగ్రహమునకు పాత్రుడవు అయినప్పుడు తప్పక జ్ఞానము నిన్ను వరిస్తుంది. ఆయన దగ్గర జ్ఞానం తప్పించి ఏమీ లేదు. అందువలన ఇచ్చేది అదే. మనకు ఏది మంచిదో మన కంటే ఎక్కువగా గురువుకు తెలుసు. అది మనకు ఇచ్చేవరకూ జన్మ జన్మలకు వెంటాడుతూ ఉంటాడు. మనకు ఆత్మానుభవం కలిగేవరకూ మనలను విడిచి పెట్టడు. వాడు గురువు!



# అరుణాచల మహత్మ్యం అక్షరమణమాల

అరుణాచలాన్ని స్మరిస్తే చాలు, మోక్షం వచ్చి తీరుతుంది. అది ఈశ్వరాజ్ఞ! అనేవారు భగవాన్ శ్రీ రమణ మహర్షి. అట్టి అరుణాచలాన్ని స్తుతిస్తూ భగవాన్ 108 ద్విపదలతో కూర్చిన అక్షరమణమాల భక్తి రసంతో నిండిన అద్వైత బోధ. శ్రీనాన్నగారు తమ అనుగ్రహ భాషణములలో అనేక సందర్భాలలో అక్షరమణమాల విశిష్టతని, అక్షరమణమాలలోని ద్విపదల హృదయాన్ని విప్పి, భక్తుల హృదయాలలో నిలిచిపోయేలా విశదపరిచారు. వారి ప్రవచనముల నుంచి వీటిని సేకరించి, ఈ సంచికతో ప్రారంభించి, రాబోయే సంచికలలో శ్రీనాన్నగారు వివరించిన మరికొన్ని ద్విపదలు భక్తులైన మీతో పంచుకునే ప్రయత్నం ఇది.

అరుణగిరి హిమాలయ పర్వతాలకంటే పురాతనమైనది. అరుణాచలేశ్వరుడి యొక్క వైభవం పురాణాలలోనే కాదు, వేదాలలో కూడా దీని వైభవం వర్ణించారు. వ్యక్తిభావనను అహంభావనను అణచటానికి వచ్చిన క్షేత్రం యిది. బ్రహ్మదేవుడు విష్ణుదేవుడు నేను గొప్ప నేను గొప్ప అని అనుకొంటూ ఉంటే, పరమేశ్వరుడు వారి అహంభావనను అణచటానికి మొదట జ్యోతిరూపంలో దర్శనం ఇచ్చి తరువాత గిరిరూపం ధరించాడు. అరుణాచలేశ్వరుడి అనుగ్రహం వలననే రమణమహర్షి గారిని జ్ఞానం వరించింది.

ఇండియన్ హిస్టరీలో ఒకో మహాత్ముడు ఒకో క్షేత్రానికి ఆకర్షింపబడ్డాడు. యేబదినాలుగు సంవత్సరములు ఈ క్షేత్రంలో ఉన్నాను, ఎప్పడూ ఈ క్షేత్రాన్ని విడిచిపెట్టి వెళ్ళాలనే తలంపు కూడా నాకు రాలేదు అని రమణస్వామి చెప్పారు. శ్రీరమణస్వామి విరూపాక్ష గుహలో ఉండగా కొందరు భక్తులు బిక్షకోసం ఏవైనా పాటలు వ్రాసి ఇవ్వమని ప్రార్థించారు. అంత ఒకనాడు భక్తులతో కలిసి అరుణగిరి ప్రదక్షిణ చేస్తుండగా “అరుణాచల మనుచు స్మరియించువారల అహము నిర్మూలింతువరుణాచలా!” అని తన హృదయములోనుంచి పొంగి వస్తున్న ద్విపదతో అక్షరమణమాలకు శ్రీకారం చుట్టారు శ్రీ రమణస్వామి.

అక్షరమణమాల అంటే పెళ్లి నాటి మాల. అక్షర-మణ-మాల, పువ్వులతోటి

చేసినటువంటి మాల కాదు, అక్షరములతో తయారు చేసిన మాల; మణ అంటే మాల అంటే పెళ్లినాటి మాల. అక్షరమణమాలని అరుణాచలేశ్వరుడు అనే పెళ్ళికుమారుడికి, రమణస్వామి అనే పెళ్లికుమార్తె అలంకరించింది. ఆ మాల క్షరము అయ్యేది కాదు. పువ్వులతోటి తయారుచేసినటువంటి మాల వాడిపోతుంది. ఇది ఇమ్మోర్టల్, వాడిపోయేది కాదు, నశించేది కాదు, కలకాలం చిరకాలం ఉండే మాల. ఇది మనం కలకాలం చిరకాలం స్మరించుకోదగినటువంటి మాల. పెళ్ళికొడుకు పెళ్ళికూతురు మాలలు మార్చుకుంటారు. నేను నీకు అక్షరాలతోటి తయారుచేసిన ఈ మాలను వేస్తాను, నువ్వు కరుణ దయ అనే మాలని నా మెడలో వెయ్యి అరుణాచలా!

ఈ అక్షరమణమాలలో రమణస్వామి అనేక కోణాల నుండి అరుణాచలేశ్వరుడి యొక్క ఔన్నత్యం చెపుతూ వచ్చాడు. ఈ మాల ఆయనకోసం కాదు, అది వంపు పెట్టుకొని మనకోసమే ఆ మాల చెప్పారు. జగత్తు జీవుడు ఈశ్వరుడు కల్పితమే అని చెప్పినటువంటి రమణస్వామికి ఈ పెండ్లినాటి మాలతోటి పని ఏముంది? ఆయన ద్వైత స్థితిని దాటినటువంటి వ్యక్తి. ఇంత అద్వైతం చెప్పినటువంటి రమణస్వామి అది వంపు పెట్టుకొని మన కోసమే ఆ మాల చెప్పాడు. మనందరికీ ఈ లోకంతోటి, కనిపిస్తునటువంటి ప్రపంచంతోటి పెళ్లి అయ్యింది. ఇది అటువంటి పెళ్లి కాదు, ఆత్మతోటి పెళ్లి చేసుకొంటున్నాడు. మనకి నిరంతరమూ లోక స్మరణే. ఆత్మని చింతించటం మానేసి, నిరంతరమూ లోకాన్ని గురించి చింతిస్తుంటే, చెరుకుగెడ రసం తీసేసిన తరువాత పిప్పిని నమిలితే ఎంత రసం వస్తుందో, లోకాన్ని స్మరించినా అంతే ఉద్ధరించబడతాము. అందుచేత లోకానికి అర్పించి నటువంటి మన మనస్సుని ఈశ్వరుడివైపు మళ్లించటం కోసం, ఆత్మవైపు మళ్ళించటం కోసం, సౌందర్యం వైపు మళ్లించటం కోసం, లైఫ్‌లో క్వాలిటీ పెంచటం కోసం, ఈ అక్షరమణమాల తయారు చేసాడు. మనం ఆత్మతోటి పెళ్లి చేసుకోవాలి. సత్యంతోటి పెళ్లి చేసుకోవాలి, నిజంతోటి పెళ్లి చేసుకోవాలి, అది నీ హృదయంలోనే ఉంది. ది కింగ్డమ్ ఆఫ్ హెవెన్ ఈజ్ వితిన్ యు! ఏసు అన్నటువంటి స్వర్గరాజ్యం మీ హృదయంలోనే ఉంది. నిజమైన అరుణాచలం మీ హృదయంలోనే ఉంది. అది భగవాన్ చెప్పింది!

మీకు ఆత్మతోటి టచ్ ఉంటే ఈ బాహ్యమైనటువంటి జీవితంలో ఒడిదుడుకులు వచ్చినప్పటికీ, కష్టసుఖాలు వచ్చినప్పటికీ అవి మిమ్మల్ని తాకవు. తత్త్వం మీ చేతిలో ఉన్నప్పుడు ఎంత దుఃఖం కూడా మిమ్మల్ని కదిలించలేదు. అటువంటి ఉన్నతస్థితికి, దుఃఖంలేని స్థితికి మనల్ని తీసుకెళ్లటం కోసమే; హృదయంలో ఉన్నటువంటి ఆనందసముద్రంలో మనం ప్రవేశించటం కోసమే ఈ అక్షరమణమాలను తయారు చేసాడు భగవాన్ శ్రీ రమణమహర్షి.

**గణపతి ప్రార్థన :**

**సాక్షాదరుణ గిరీశ్వర వరార్హమగు ।**
**అక్షరమణమాల నమరించుటకును ॥**

**కరుణాకరుండగు గణపతి యొసగి ।**
**కరమభయకరము కాపాడుగాక ॥**

తా॥ కరుణామయుడవైన ఓ గణపతీ! సాక్షాత్తూ అరుణాచలేశ్వరుడను పెండ్లి కుమారునికి అలంకరించుటకు తగినటువంటి పెండ్లి మాలను అక్షరములతో కూర్చుటకు నాకు నీ అభయ హస్తాన్ని ప్రసాదించి కాపాడు స్వామీ!

రమణస్వామి విఘ్నేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నాడు. ఏమని ప్రార్థిస్తున్నాడంటే - **సాక్షాత్ అరుణ గిరీశ్వర వరార్హమగు** - మామూలు పెళ్లికొడుకు అయితే బజారులో 10 రూపాయలో, 20 రూపాయలో పెట్టి దండ కొనుక్కుని పెళ్లి కొడుక్కి వెయ్యచ్చు. "నేను మామూలు పెళ్లికొడుక్కి ఈ దండను తయారుచేయటంలేదు, ఎటువంటి పెళ్లికుమారుడు? సాక్షాత్తు అరుణాచలశివుడు! శివుడు అనే పెళ్లి కుమారుడికి దండ తయారుచెయ్యటానికి నేను పూనుకున్నాను. ఈ పెళ్లి కొడుకు మామూలు పెళ్లికొడుకు కాదు, పరమేశ్వరుడు" అంటున్నారు ఇక్కడ రమణస్వామి.

ఈ దేహాభిమానం ఉన్నటువంటి జీవులని, మనస్సుని అభిమానిస్తున్నటువంటి జీవులని, అహంకారాన్ని అభిమానిస్తున్నటువంటి జీవులని, దేహాన్ని మాత్రమే నేను అనుకునే ఈ జీవులని ఆత్మవైపు తిప్పటం కోసం, మనస్సుని అంతర్ముఖం చెయ్యటం కోసం, ఆత్మానుభవం కలిగించటం కోసం నేను ఒక దండను తయారు చేస్తున్నాను.

ఓ గణపతి స్వామీ, విఘ్నాలు రాకుండా చూసే స్వామివి నువ్వు. అటువంటి దండను తయారు చేసేటప్పుడు మొట్టమొదటిగా నిన్ను ప్రార్థిస్తున్నాను. నువ్వు నాకు అభయం ఇచ్చి, ఈ పని పూర్తి అయ్యేలాగ నన్ను ఆశీర్వదించు ఓ గణపతీ. ఇలా గణపతిస్వామి ప్రార్థన చేసి తన దండను ప్రారంభించారు రమణస్వామి.

**అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచలా!**

**అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచలా!**

**అక్షరమణమాల - ద్విపద 1.**

**అరుణాచలమనుచు స్మరియించు వారల**
**అహము నిర్మూలింతు వరుణాచలా!**

తా: "అరుణాచలా" అని నిన్ను స్మరించు వారి అహంకారమును హరించివేస్తావు అరుణాచలా!

రాత్రి అనక, పగలు అనక, సెకనులు మరిచిపోయి, గంటలు మరిచిపోయి, రోజులు మరిచిపోయి, అమావాస్య అని పౌర్ణమి అని తిథులు కూడా మరిచిపోయి, నక్షత్రాలు, ఖగోళం, భూగోళం సమస్తమూ మరచిపోయి, ఎవరైతే తన ఇంద్రియాలని, తన మనస్సుని తన అహంకారాన్ని, అరుణాచలేశ్వరుడి యొక్క స్మరణలో ఎవడైతే నానబెట్టుకొంటున్నాడో, వాడి యొక్క అహంకారాన్ని మూలంతో సహా తీసేసే స్వభావం నీలో ఉంది! ఎవరైతే అరుణాచలా అరుణాచలా అరుణాచలా అని స్మరిస్తున్నారో, ఎవరైతే తలపెడుతున్నారో, ఎవరైతే ఆ స్మరణలో జీవిస్తూ, ఆ స్మరణలో ఎవరికైతే ప్రాణం పోతుందో, వాళ్లకి తప్పనిసరిగా మోక్షం వస్తుంది అని ఈ మాట భగవాన్ ఒకసారి చెపుతుంటే, ఒకడు అన్నాడు, ఏమండీ అలా చెపుతున్నారు. అరుణాచలం అని స్మరించుకుంటేనే మోక్షం వచ్చేస్తుందా? మోక్షం అంటే అంత తేలికగా ఉందా అన్నాడు. "అది ఈశ్వర ఆజ్ఞ. అడగటానికి నువ్వు ఎవడవు?" కాశీలో మరణిస్తే మోక్షం వస్తుంది, అరుణాచలాన్ని స్మరిస్తే మోక్షం వస్తుంది, చిదంబరాన్ని దర్శిస్తే మోక్షం వస్తుంది, అని ఈశ్వరుడు చెప్పిన ఆజ్ఞ, అడగటానికి నువ్వు ఎవడవు? నువ్వు అరుణాచలాన్ని స్మరించి చూడు, అప్పుడు మోక్షం రాకపోతే అడుగు! అసలు నువ్వు సాధన చెయ్యకుండా, స్మరణ చెయ్యకుండా, కాలు కదపకుండా, వేలు మెదపకుండా, ఏమీ ప్రయత్నం చెయ్యకుండా, వస్తుందో రాదో అని అనుమానం పెట్టుకుంటావు ఏమిటి? అసలు నువ్వు చదువు, చదివిన తరువాత, చదువు రాకపోతే అప్పుడు అడుగు! పుస్తకం తీయకుండా, నాకు చదువు వస్తుందా అంటావు ఏమిటి? అరుణాచలాన్ని స్మరిస్తేనే ముక్తి వచ్చేస్తుందా, అంటే వస్తుంది! వచ్చి తీరుతుంది! అనుమానించటానికి నువ్వు ఎవడవు? ప్రశ్నించటానికి నువ్వు ఎవడవు?

అరుణాచలమనుచు స్మరియించువారల - ఎవరి అబ్బగారి సొమ్ము అండీ! స్మరించుకోవాలంటే మనం స్మరించుకోగలమా! ఎన్ని గొడవలు జ్ఞాపకం వస్తాయో మనకి! ఊరికే అరుణాచలం స్మరణ అని రమణస్వామి చెప్పారు, అయితే నిరంతరం మీరు ఆ స్మరణలో ఉండగలరా! నిరంతరమూ మీ దేహాన్ని మరిచిపోయి, మీ అహంకారాన్ని మరిచిపోయి, మీ మనస్సుని మరిచిపోయి, మీ రూపాలని మరిచిపోయి, మీ గౌరవాలని మరిచిపోయి, మీ అగౌరవాలని మరిచిపోయి, మీ గొప్పలని మీ కీర్తులని మీ ఆస్తులని

మరిచిపోయి, అరుణాచలాన్ని నిరంతరం స్మరించగలమా మనం? మన గౌరవాలే జ్ఞాపకం వస్తాయి, మన గొప్పలే జ్ఞాపకం వస్తాయి, మన కులాలూ గోత్రాలూ మనకి జ్ఞాపకం వస్తాయి కానీ, అరుణాచల శివుడు జ్ఞాపకం వస్తాడా మనకి? మీ దేహాల్ని మరిచిపోయి, మీ రూపాయిలని మరిచిపోయి, మీ ఆస్తులని మరిచిపోయి, అరుణాచలాన్ని స్మరించగలరా!

నిజమైన అరుణాచలేశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు. అరుణాచలా అరుణాచలా అరుణాచలా అని ఎవరైతే ప్రీతిపూర్వకంగా స్మరిస్తున్నారో, ఎవరైతే హృదయపూర్వకంగా, నిండు మనస్సుతోటి కపటం లేకుండా ఎవరైతే స్మరిస్తున్నారో, వారి యొక్క అహంకారాన్ని నిర్మూలిస్తావు అరుణాచలా! అరుణాచలా అరుణాచలా! మియర్ రిమెంబరెన్స్ ఆఫ్ అరుణాచల గివ్స్ మోక్ష! మిమ్మల్ని ఏమీ ప్రాణాయామాలు చేయమనటం లేదు, ఆవునెయ్యి ఖర్చు పెట్టి హోమాలు చేయమనటం లేదు. మియర్ రిమెంబరెన్స్ ఆఫ్ అరుణాచల గివ్స్ మోక్ష! అరుణాచలా అరుణాచలా అరుణాచలా అనే స్మరణ మాత్రం చేతనే మీకు మోక్షాన్ని ఇచ్చే క్షేత్రం అరుణాచలం!

మీ దగ్గరనుంచి ఏమీ ఆశించటం లేదు, ఊరికే స్మరణ మాత్రమే ఆశిస్తున్నాడు. అలాగే అరుణాచలం అంటూ నిరంతరం స్మరిస్తూ ఉంటే, నిజంగా అలా స్మరణ చేస్తూ ఉంటే, నీకు తెలియకుండానే, నీ యొక్క అహంకారాన్ని కాల్చి బూడిద చేస్తాడు. నాకు ఏది మంచిదో నాకు తెలియదు, కానీ నాకు ఏది మంచిదో నాలో ఉన్న పరమేశ్వరుడికి తెలుసు. నా అహంకారం పోవటం నాకు చాలా మంచిది. ఏదైతే పోతే నేను మోక్షం పొందుతానో, అటువంటి అహంకారాన్ని కాల్చేసి బూడిద చేస్తాడు. ఓ అరుణాచలేశ్వరుడా, నిన్ను ఎవరైతే స్మరిస్తున్నారో వాళ్ల అహంకారం తీసేయమని నేను ఏమీ రికమెండేషన్ చేయటం లేదు. అది నీ వృత్తి అయ్యా, అది నీ డ్యూటీ అయ్యా, నీ ధర్మం అయ్యా! ఎవరైతే అరుణాచలా అరుణాచలా అరుణాచలా అరుణాచలా అని, వాడి బుద్ధిని, వాడి మనస్సుని, వాడి శరీరాన్ని, మొత్తం మానవుడిలో ఉన్న వాడి శక్తులు అన్నీ కూడా కేంద్రీకరించి అరుణాచలాన్ని స్మరిస్తున్నాడో, అరుణాచలేశ్వరుడు వాడి అహంకారాన్ని తీసేసే పని పెట్టుకున్నాడు. అది వాడి పని! నేను ఏమీ రికమెండేషన్ చేయటం లేదు, నేను ఏమీ చేయమని చెప్పటం లేదు. ఓ అరుణాచలేశ్వరుడా ఫలానా వాడు అరుణాచలాన్ని స్మరిస్తున్నాడు, వాడి అహంకారాన్ని తీసేయి అని నేనేమీ రికమెండేషన్ చేసే పని పెట్టుకోలేదు. అరుణాచలేశ్వరుడు చేసే పని మీకు చెపుతున్నాను అంటున్నాడు రమణస్వామి.

**అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచలా!**

**అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచలా!**



# శ్రీమద్భగవద్గీత

## గీతాసారము .. నాన్నగారి మాటలలో

**ప్రపంచంలో మనుషులకి పుట్టినరోజు జరుపుకుంటాము కానీ పుస్తకాలకి కాదు. ఆ వైభవం ఒక్క భగవద్గీతకే దక్కింది. గీత చెప్పిన వాడు భగవంతుడే, విన్నవాడు భగవంతుడే, రాసినవాడు భగవంతుడే, అన్నాడు శ్రీకృష్ణుడు. అందుకే ఆ శాస్త్రానికి అంత గౌరవం వచ్చింది. గీత అర్థం అవ్వాలంటే మన హృదయం దానికి ఇవ్వాలి. అందులోని 700ల శ్లోకాలలో ప్రపంచంలో ప్రతిఒక్కరికీ సమాధానం దొరుకుతుంది. శ్రీనాన్నగారు గీతలోని కొన్ని శ్లోకాల సారాన్ని భక్తుల మనోవికాసానికి సాధనకి ఉపయోగపడే రీతిలో తెలిపారు. శ్రీనాన్నగారు సూక్ష్మంగా వివరించిన కొన్ని శ్లోకాలు ఈ సంచిక నుంచి మీ ముందు ఉంచుతున్నాము.**

ప్రస్తుత హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రంలో ఐదువేల సంవత్సరాలకి పూర్వం భారత యుద్ధం ప్రారంభం అయ్యే ముందు, ఒక పక్క కౌరవసేన, ఒక పక్క పాండవసేన నిలబడి ఉండగా, మధ్యన భగవంతుడు వాసుదేవస్వామి అర్జునుడికి చెప్పిన శాస్త్రం గీతాశాస్త్రం. రథం నిలబెట్టి గీత చెప్పిన చోటు కురుక్షేత్రంలో జ్యోతిసర్ అనే స్థలం. ఇది భగవంతుడి ముఖంలోంచి వచ్చిన మోక్షశాస్త్రం, యోగశాస్త్రం. ఇది కేవలం భారతీయులకే కాదు, ప్రపంచంలో మానవజాతి అందరికీ పనికివచ్చే శాస్త్రం. వాసుదేవస్వామి చెప్పారు, అర్జునుడు విన్నాడు, రాసినవాడు వ్యాసుడు. చెప్పిన వాడు నారాయణ స్వరూపుడే, విన్నవాడూ నారాయణ స్వరూపుడే, రాసినవాడూ నారాయణ స్వరూపుడే. అందుకే దానికి అంత వైభవం వచ్చింది.

భగవంతుని నామాలైన “రామా, కృష్ణా, శివా” అని స్మరించటం వల్ల ఎంత పుణ్యం వస్తుందో, “గీతా గీతా” అని స్మరించటం వల్ల కూడా అంతే పుణ్యం వస్తుంది. దుఃఖనివృత్తి అవుతుంది. మరణకాలమందు కనీసం “గీతా గీతా” అని స్మరిస్తే పుణ్యలోకాలు వస్తాయి, ఉత్తమజన్మలు వస్తాయి.

ప్రపంచంలో ఎక్కడా లేనిది ఈ గీతలో ఉండవచ్చును కానీ, ఈ గీతలో లేనిది ప్రపంచంలో ఎక్కడా లేదు. భగవంతుడు ఈ గీతాశాస్త్రాన్ని ఆధారం చేసుకునే ఈ మూడు లోకాలలోనూ తాను పరిపాలిస్తున్నానని గీతలో చెప్పాడు. భగవద్గీత భగవంతుని రాజ్యాంగము. భగవద్గీత అంటే అది శాశ్వతసత్యము. ఎంతకాలమైతే ఈ రాత్రి పగళ్ళు తిరుగుతుంటాయో ఎంతకాలమైతే ఈ కాలచక్రం తిరుగుతుందో అంతకాలమూ ఈ గీతలో చెప్పినవి శాశ్వత సత్యాలు. మానవుడిని యదార్థస్థితికి, మహోన్నతమైన స్థితికి తీసుకువెళ్ళే సత్యాలు. గుడిలో దేవుడు ఉన్నాడని మీరు ఎలా అనుకుంటున్నారో, భగవంతుడే మాటల రూపంలో ఈ గీతలో

చెప్పాడు.

భగవగ్గీత ఉపదేశ గ్రంథం. అర్జునుడిని అడ్డుగా పెట్టుకొని మన అందరికీ భగవంతుడు ఉపదేశం చేసాడు. వాసుదేవస్వామి పరమాత్మ, అర్జునుడు జీవాత్మ. జీవలక్షణాలు ఉన్న మనమందరమూ జీవులమే. కనుక అర్జునుడికి చెప్పిన ప్రతీ మాట మనకి కూడా వర్తిస్తుంది.

అర్జునుడి దుఃఖాన్ని పోగొట్టటానికి వేదాల యొక్క సారమును, ఉపనిషత్తుల యొక్క సారమును శ్రీకృష్ణుడు భగవద్గీత రూపంలో మన అందరికీ అర్థమయ్యేలాగ, ఆచరణ దృష్టిలో పెట్టుకొని వివరంగా బోధించాడు. మనము ఏమి చెయ్యాలి, ఏమి చెయ్యకూడదు, ఎలా నడుచుకోవాలి, ఎలా నడుచుకోకూడదు అన్నీ గీతలో వర్ణించిన విస్తరిలా చెప్పారు. గీతని లోతుగా అధ్యయనము చేస్తే ఇంద్రియములకు మనస్సుకు ఏకాగ్రత కుదురుతుంది. ఏకాగ్రతతో సాధించలేనిది ఏముంది? పక్షి ఎగరటానికి రెండు రెక్కలు ఎంత అవసరమో, అదే విధంగా మానవుడు నైతికంగా, సాంఘికంగా, ఆధ్యాత్మికంగా వికశించుటకు ఏకాగ్రత పవిత్రత అంత ముఖ్యము. మనస్సు జీవితమును బాగుచేయనూ గలదు మరియు నాశనము చేయనూ గలదు. అట్టి మనస్సును తీర్చిదిద్దుకొనుటకు భగవద్గీతతో సమానమైన గ్రంథము లేనేలేదు. సంసారము నుంచి బయటపడి అమృతస్థితిని అందుకొనుటకు గీత ఎన్నో ఉపాయములు మానవజాతికి బోధించింది. సత్యాన్వేషకుడికి భగవద్గీత అండగా నిలబడుతుంది.

అజ్ఞానము నుండి విముక్తి చేసే గ్రంధరాజము శ్రీమద్భగవద్గీత. విశ్వశ్రేయస్సే గీతామాత యొక్క లక్ష్యము.

భగవద్గీతలో మీకు బాగా నచ్చిన శ్లోకం చెప్పండి అని రమణమహర్షిగారిని అడిగితే అన్నీ ఇష్టమే అని చెప్పారు. అంతా మేము చదవలేము, ఏదో ఒక శ్లోకం చెప్పండి, దానిని పట్టుకుంటాము అని అడిగితే అప్పుడు భగవాన్ ఈ శ్లోకం చెప్పారు. గీతాసారమంతా ఈ ఒక్క శ్లోకంలో ఉంది అని చెప్పారు భగవాన్.

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః।**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ॥ (గీత 10:20)**

ఓ అర్జునా! సమస్త ప్రాణుల హృదయముల యందున్న ఆత్మను నేనే! సకల భూతముల (ప్రాణుల) ఆదియు, మధ్యస్థితియు, అంతము నేనే! (ప్రాణుల యొక్క సృష్టి స్థితి లయములకు కారణము నేనే.)

కృష్ణుడు అంటే మనిషి అనుకోకండి. ఆయనే చెప్పాడు నేను ఆత్మని అని. "అహమాత్మా గుడాకేశా" - మీ అందరి హృదయాలలో, ఏ చైతన్యం, ఏ నారాయణుడు అయితే ఉన్నాడో

అది నేనే! మీ హృదయంలో ఉన్న నిజాన్ని నేనే. గుడాకేశుడు అంటే అర్జునుడు.

నేను అందరి హృదయాలలో చైతన్యంగా, ఆత్మగా ఉన్నాను. నేను ఏ జీవుడిని విడిచిపెట్టి లేను. నేను అందరి హృదయాలలో సమానంగా ఉన్నాను. ఈ జీవకోటికి ఆది నేను, మధ్య నేను, అంతం నేను. ఈ జీవకోటి అంతా నాలో నుండే వస్తున్నారు, నాలోనే పెరుగుతున్నారు, మరల నాలోనే లయమవుతున్నారు. ఈ జీవకోటికి అంతా నేనే ఆధారము అని భగవంతుడు చెపుతున్నాడు.

మనం చెప్పేమాటకి, మనకి వచ్చే ఆలోచనకి, చేసే పనికి సాక్షిగా ఉంటాడు. నిద్ర, మేలుకోవటం, స్వప్నం, ఇవన్నీ సాధకుడికి. ద్వంద్వాలకి, చీకటికి, పగలుకి అతీతుడైనవాడే నారాయణుడు. మీ గమ్యాన్ని నేనే. నన్ను తెలుసుకుంటేనే మోక్షం. నన్ను తెలుసుకొనేవరకూ మీకు సుఖం లేదు, శాంతి లేదు. ఈ సృష్టి స్థితి లయాలన్నీ చేసేవాడిని నేనే. అందరి గురించి నాకు తెలుసు. నాకు తెలియకుండా ఈ సృష్టిలో జరగటానికి ఏమీ లేదు, అంటున్నాడు. వర్షం రప్పించేది ఆయనే, ఆపేది ఆయనే. మీకు వచ్చే సుఖం ఆయనే, మీకు వచ్చే దుఃఖం ఆయనే. అన్నీ ఆయనే అని చెప్పే బదులు, ఉన్నదే ఆయన అంటే బాగుంటుంది.

ఈ శ్లోకం అర్థం అవ్వటం కష్టం. రూపబుద్ధి ఉన్నవారికి, నామబుద్ధి ఉన్నవారికి, ఇది అర్థం కాదు. భగవంతుడు హృదయంలో ఉన్నాడు. నామం లేకుండా ఉన్నాడు, రూపం లేకుండా ఉన్నాడు. పని లేకుండా ఉన్నాడా అంటే పని చేస్తున్నాడు. ఈ దేహం భూమి మీదకి ఎందుకు వచ్చిందో, ఆ దేహం యొక్క ప్రారబ్ధమును అనుసరించి దేహాన్ని ఆడిస్తున్నాడు. డైరెక్టుగా హృదయంలో ఉన్న వస్తువును ఉపాసన చెయ్యటం కష్టం. అందువలన ఏదో ఒక అవతారపురుషుని కానీ, గురువును కానీ తీసుకొని ఉపాసన చేసుకోమని చెప్పటం కోసం, గీతలో భగవంతుడు కృష్ణుడిని నేను, రాముడిని నేను, కుమారస్వామిని నేను, శంకరుడిని నేను అని చెప్పుకొంటూ వచ్చాడు. అంటే మనం ఉపాసన చేసుకోవటం కోసం ఇవి అన్నీ చెప్పాడు. ఉపాసన లేకపోతే మోక్షం రాదు.

భగవద్గీత చదివితే మనకు తెలియని విషయం ఉండదు. భగవద్గీత చదవకపోతే కృష్ణుడు గురించి మీకు తెలియదు. మీకు ఏదైనా విషయంలో దుఃఖం వస్తూఉంటే, గీత శ్రద్ధగా చదివితే మీ దుఃఖాన్ని తీసివేసే శ్లోకాలు అనేకం గీతలో ఉన్నాయి. మనం బాగుపడటానికి గీతలో ఉన్న ఒక్క శ్లోకం చాలు. మీ మనస్సులో ఉన్న దోషాలు అన్నీ ఒక్క జన్మలో పోవు. మీ దోషాలు తెలుసుకొని, వాటిని తొలిగించుకోవటానికి సాధన చేయాలి. వాటిని పోగొట్టుకోవటానికి బహుజన్మల కృషి చేయాలి. బహుజన్మల కృషి వలన కానీ నీకు ఆత్మజ్ఞానం కలుగదు అని గీతలో భగవంతుడు చెప్పాడు.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

సెప్టెంబర్ 23 **సద్గురు శ్రీ నాన్నగారి జయంతి**

ఉదయం గం॥ 6-00లకు **పారాయణ**

ఉదయం గం॥ 7-00లకు **అల్పాహారం**

ఉదయం గం॥ 8-00లకు **పూజాకార్యక్రమములు**

ఉదయం గం॥ 9-00లకు **పెద్దిరాజుగారి ప్రవచనం**

ఉదయం గం॥ 11-00లకు **అన్న ప్రసాదం**

మధ్యాహ్నం గం॥ 1-00లకు **డా॥ ఉష & వైజాగ్ సుజాత గార్ల ప్రవచనం**

## ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174

**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**మీ చందా గడువు ముగిసినది.**

**కావున చందాను పునరుద్ధరించుకోగలరు.**

భక్తుల కోరికపై సద్గురువు శ్రీ నాన్నగారి భోదామృతం ఇంకా వివరంగా అందివ్వాలనే ఉద్దేశంతో **రమణభాస్కర** మాసపత్రిక సెప్టెంబరు సంచిక నుండి మార్పులు చేస్తున్నాము. దీనికి భక్తుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నాము. పత్రికకు సంవత్సర చందా కట్టడంలో భక్తులు ఇబ్బందులు చెపుతున్నందు వలన ఇప్పటినుండి **శాశ్వతచందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లుగా నిర్ణయించడమైనది. భక్తులందరూ ఈ అవకాశమును ఉపయోగించుకొని రమణభాస్కర మాస పత్రికకు శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**శాశ్వత చందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లు

**సంవత్సర చందా** రు॥ **150**/-లు

# పాపి కూడా గురు సంపర్కం వల్ల కృతార్థుడు అవుతాడు

విశ్వాసవతియైన భార్య తనను తప్ప ఇతర స్త్రీలను ప్రేమింపని భర్తయందు బద్ధానురాగిణియై గృహకృత్యాలు అన్నీ అత్యంత శ్రద్ధతో తనకు తానే ఏరకంగా నిర్వహిస్తుందో చూస్తున్నాము. ఆ భర్త ఆమెను కాక ఇతర స్త్రీలను ప్రేమించినట్లు తెలిసిందా విరక్తితో గృహకృత్యాలు చేయక నిర్లిప్తంగా ఉంటుంది. అలాగే మనకు తనను నమ్మిన సద్గురువునందు అనన్య భక్తి ఉంటే ఆ గురువే మనకు కావలసినవన్నీ సరిదిద్దుతాడు. పుష్పకవిమానంలో నిజ ధామానికి తీసుకొనివెడతాడు. శ్రీనాన్నగారు "మన భక్తి కోరికకు పరిమితం కాకుండా ఆత్మ దర్శనం కోసమే ఉండాలి. అసలు మనం వచ్చిన పని ఏమిటి? అనేది ప్రతీ సెకను జ్ఞాపకం పెట్టుకొని మానసికంగా గురు సంపర్కంతో గడపాలి" అన్నారు. కబీర్ "దేవుణ్ణి వెతుకుతూ వెతుకుతూ తిరిగాను, చివరికి నన్ను నేను కోల్పోయాను" అంటాడు. ఆధ్యాత్మిక శోధన యొక్క అద్భుతమిదే ఏ రోజైతే తనను తాను కోల్పోతాడు అంటే (మనస్సు గారడీలను మర్చిపోతాడో) ఆ రోజే సత్య శోధన పూర్తి అవుతుంది. సాధకుడు మాయమైన వెంటనే సత్య దర్శనమౌతుంది. ప్రతీసాధకునకు తన గురువుపట్ల కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉంటాయి. సద్గురువును గురువుగా పరమాత్మగా చూడరు. తన ప్రాపంచిక అభిప్రాయాలు వేరు. అవి నెరవేర్చని గురువు అతని దృష్టిలో మంచి గురువు కాదు. ఏ గురువు ప్రారబ్ధాన్ని తీసేయడు వాటి ద్వారా పాఠాలు నేర్పి పవిత్రుణ్ణి చేస్తాడు. గురువు నాకు రక్షకుడుగా ఉన్నాడు అనే పట్టుదల ఉంటే పరమార్థాన్ని పొందటం అసాధ్యం కాదు. "శిష్యుడు సిద్ధంగా ఉన్నప్పుడే గురువు ప్రత్యక్షమౌతాడని శాస్త్రం చెబుతున్నది. సిద్ధంగా లేకపోతే గురువు చెంత ఉన్నా గుర్తించటం కష్టం. వజ్రం దొరికినప్పుడు దాని సంగతి తెలియనప్పుడు అది గాజు పెంకని విసిరి పారేస్తాడు. అర్హత లేనప్పుడు గాజు పెంకును (కపట గురువును) వజ్రంగా దాచుకొని మురిసిపోతాడు. ఆధ్యాత్మిక విద్య పుస్తకాలు చదివితే రాదు. గురుముఖఃతా రావాలి. సద్గురువు అనుగ్రహం వల్ల సంసారంలో ఉన్న వానికి కూడా ముక్తి లభిస్తుంది. గురువుతో మానసికంగా బ్రతకటం వల్ల ఆయన ఉ నికిలో ప్రవహించే రసాన్ని మనకు అందిస్తాడు. ఆ అమృతం అవ్యయం ఆ నిధి కావలసినంత త్రాగవచ్చు. దాన్ని మన స్వయంకృషితో పండించుకోలేము. ఆ రసాన్ని ఎలా త్రాగాలి? ఎలా జీర్ణించుకోవాలి? అనేది మనం నేర్చుకోవాలి. అంటే దానికి 'ఆర్తి' కావాలి. ఆయన మాంసం, ఎముకలను మన ఉనికిలో ప్రవేసించి మన ఉనికిగా మారిపోతాడు. మనం గురువు ఛాయాచిత్రం సన్నిధిలో ఆయన్ను సజీవంగా భావించాలి. విచారంగా కాక సరళంగా ఉండాలి. ఆయనకు మనకు మధ్య అప్పుడు సంతోషం వంతెనగా ఏర్పడుతుంది. అవి చల్లగా మౌనంగా ఉంటుంది. మనం ఎంత శాంతంగా ఉంటామో గురువు మనకు అంత అందుబాటులో ఉంటాడు. అది దగ్గరగా ఉండే మార్గము. మనం ఎవరిమో, ఏది నిజంగా ఉందో మనంతట మనం తెలుసుకోలేము. అది తెలియనంతకాలం నీవు - నేను అనే సిద్ధాంతాలకు వేళ్లాడుతూ కలల భ్రమలో బ్రతుకు భారంగా సాగిస్తాము. దానికి గురు సంపర్కమే పరిష్కారం.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**

RNI. NO. APTEL / 1999 / 01667
Postal Regn. No. BMV / M - 1 / 2018 - 2020



సద్గురు శ్రీ నాన్నగారి పాదపద్మములు

Registered News Paper

Postage
Prepaid

If undelivered please return to
**RAMANA BHASKARA**
Sri Ramana Kshetram
JINNURU - 534 265, W.G.Dt., A.P.

Editor & Publisher : **Bhupathiraju Venkata Lakshmi Narasimha Raju**
Jinnuru - 534 265, W.G.Dt., A.P., ☎ 08814-222808
Printer : D.S. Rao, Printed at : SRI BHAVANI OFFSET PRINTERS, SVR Complex, Main Road, Palakol - 534 260, Cell : 9848716747